# ఓ చవట కథ!

## వసుంధర

బస్ ఒక్క కుదుపుతో ఆగిపోయింది.

"ఏమయింది?" ఎవరో అడిగారు.

"ఇంజన్ ట్రబుల్—" సమాధానం వచ్చింది.

నేను చేరదల్చుకున్న ఊరికి ఉన్నది వొక్కటే బస్సు. ఊరు వదిలిపెట్టి పది నిముషాలైనా కాకుండా అది ఆగి పోయింది. ఆగేదేదో ఊళ్ళోనే ఆగితే నా ప్రాణం సుఖంగా ఉండేది. ఇంటికిపోయి పడుకునేవాణ్ని.

డ్రైవర్ తన ప్రయత్నాలు తను చేస్తున్నాడు. కానీ పని జరగడంలేదనుకుంటాను.

ఇవి ఆర్టీసీ బస్సులు. అందువల్ల వీళ్ళు మరేదో ఏర్పాటు చేస్తారనే ఆశకూడ లేదు. వెనక్కు పోవడమే ఉత్తమం. ప్రయాణం ఆగిపోవడంవల్ల నాకు పెద్ద ఇబ్బందేమీ లేదు. ఇదే ప్రయాణం వచ్చేవారం చేయొచ్చు. నాలా అనుకుంటున్నవాళ్ళు అక్కడ చాలామంది ఉన్నారు. అంతా కండక్టర్ చుట్టూ మూగారు.

"ఈ మధ్యలో వదిలేశావ్-మేము వెనక్కి వెళ్ళే మార్గం చూడు" అన్నాను.

"కాసేపు చూడండి సార్!" అన్నాడు కండక్టర్.

అక్కడ రెండు గంటలు గడిచాయి. విసుగ్గా ఉంది.

ఉత్త రోడ్డు అది. పక్కన అటూ ఇటూ పొలాలు. ఓ కిళ్ళీ బడ్డీకానీ, పాత హోటలుకానీ లేదు.

"వెధవ ఇంజను-కాస్త చూసుకుని ట్రబులివ్వద్దూ!" అని అప్రయత్నంగానే పైకి విసుక్కున్నాను. అది విని జోకు అనుకుని కొందరు నవ్వారు. నేను వాళ్ళవంక సీరియస్‌గా చూశాను.

కండక్టర్ డబ్బులు తిరిగిచ్చేయడం మొదలుపెట్టాడు. వెనక్కి పోదామనుకునేవాళ్ళను బస్సెక్కించడం కోసం కూడా చూస్తున్నాడతను. ఊళ్ళోకి వెళ్ళే నాలుగైదు ఆర్టీసీ బస్సులు ఖాళీ లేదని వెళ్ళిపోయాయి.

అక్కడ మొత్తం నాలుగు గంటలసేపు గడిపాక నాకు ఓ బస్సు దొరికింది. ఊళ్ళోకి వచ్చేక తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. ముందు ఓ హోటల్లో దూరి టిఫిన్ తిన్నాను. కిళ్ళీ వేసుకున్నాను.

నిజానికి నాకు ఆకలిలేదు. కానీ నాలుగు గంటల ఒంటరితనం, దగ్గర్లో హోటళ్లు లేకపోవడం-నాలో యేదో తినాలన్న కాంక్షను రగిల్చాయి.

కిళ్ళీ వేసుకున్నాక నాకు ఇల్లు, ఇల్లాలు గుర్తుకు రావడం జరిగింది.

ఇల్లాలుకు నేనీరోజు ప్రయాణం చేయడం ఇష్టంలేదు. సెలవుపూటా ఊరికెందుకండీ అంది.

వెర్రిమొహం-సెలవుపూట కాకపోతే ఆఫీసున్న రోజున ఊరికి వెడతారా?

అదే చెప్పాను. ఏం మాట్లాడలేదు. నన్ను దిగబెట్ట డానికి బస్టాండుకు వచ్చింది. బస్ కదిలేదాకా ఉండి కన్నీళ్ళతో వీడ్కోలిచ్చింది. ఇంతకూ నేను తిరిగిరావడం ఎప్పుడనుకున్నారు?.... రేపు ఉదయం.... రేపంటే రేపు ఉదయమే!

ఈ ఆడాళ్ళంతే! చీటికీ మాటికీ కన్నీళ్ళు. అందు లోనూ నా భార్యసంగతి చెప్పక్కర్లేదు. అది ఈ యుగంలో పుట్టాల్సిందికాదు. దానికి నా కాళ్లతప్ప ముఖం కనబడదు. అలాంటి ఆడాళ్ళంటే నాకు చిరాకు. నా భార్యన్నా నాకు చిరాకే! కానీ యేంచేస్తాం- తప్పదు! ఈ పవిత్ర భారతదేశంలో పుట్టినందు కిలాంటి భార్యల్ని భరించక తప్పదు!

ఆ విషయమే దానికి చెప్పి మరీ భరిస్తున్నాను.

దానికి సిగ్గులేదు. ఎన్ని మాటలన్నా భరిస్తుందది. తిడితే నవ్వుతుంది. కొట్టినా బాధపడదు. కానీ నేను భోజనం మానేస్తే యేడుస్తుంది. ఊరొదిలి వెళ్ళిపోతే యేడుస్తుంది.

అందుకే నేను దాన్ని యేడిపించాలంటే తిట్టను. కొట్టను. భోజనం మానేస్తాను. ఊరికి వెడతాను.

ఇప్పుడూ అలాగే ఊరికి బయలుదేరాను. కానీ యేం లాభం? ప్రయాణం మొదట్లోనే చెడిసికొట్టింది.

వెంటనే ఇంటికెళ్ళిపోతే దానికి నన్ను చూసిన సంతోషం కలుగుతుంది. అది నా కిష్టంలేదు. కానీ తనువు విశ్రాంతి కోరుతోంది. దోసెలుతిన్న కడుపు-కిళ్ళీ నమిలిన నోరు.... త్వరగా ఇల్లుచేరి నడుంవాల్చమని ప్రోత్సహిస్తున్నాయి.

ఇంటికి నడిచే బయల్దేరాను. బస్టాండునించి మా

యిల్లెంతో దూరంలేదు. పది నిముషాల నడక-అంతే!

ఈరోజు కాస్త నెమ్మదిగా నడిచాను. అయినా పదిహేను నిముషాలే పట్టింది.

ఇల్లొచ్చేసింది.

వీధి తలుపులు గడియవేసిలేవు. ఓరగా తెరచి ఉన్నాయి.

అమ్మయ్య-దాన్ని తిట్టడానికి వస్తూనే మంచి అవకాశం దొరికింది. తలుపులు బార్లా తెరిచి వదిలేస్తుందా? ఇంట్లో నేను కూడా లేనే! అంత రాచకార్యమేం తగులడింది?

అయినా దాన్ని తిట్టి యేం లాభం? ఎన్ని తిట్టినా నవ్వుతుంది. రాత్రికి భోంచేయనని చెప్పాలి. అందులోనూ ప్రస్తుతం కడుపుపోటుగా ఉంది. కాసేపు దాన్ని యేడిపించి యేడిపించి నిజంగా నా కాకలివేశాక అప్పుడే తినొచ్చు.

తలుపు తోసుకుని లోపలకు వెళ్లాను. ముందుతలుపు గడియవేశాను. దాన్ని తట్టేముందు తలుపులపట్ల నాకున్న శ్రధ్ద నిరూపించుకోవాలిక దా!

నేను వచ్చినట్లు దానికి తెలియకూడదు. అదేం చేస్తోందో నేను చూడాలి!

ఇలాంటి అవకాశం నాకెప్పుడూ రాలేదు. అనుకోకుండా ఆఫీసుకు సెలవొచ్చినా, యేదో అవాంతరంవచ్చి పని వాయిదా పడిపోయినా-నేనెప్పుడూ వెంటనే ఇంటికి వెళ్ళేవాణ్నికాను. స్నేహితులతోనో, మరో విధంగానో సరదాగా గడిపి-ఇంటికి మాత్రం మామూలుగానో, వేళతప్పో వెళ్ళేవాణ్ని.

తలుపులు తట్టకుండా ఇంట్లో ప్రవేశించే అవకాశం

కూడా ఈ రోజే నాకు ప్రథమంగా లభించింది.

ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలను కున్నాను. అడుగులో అడుగు వేసుకుంటూ వంటింటివైపు వెళ్ళాను.

నా ఇల్లాలు సీత వంటింటి పక్షి! గిన్నెలు తోము తూనో, చింతపండులో గింజలు తీస్తూనో కూర్చోడం దాని హాబీ. మొగుడితో సరదాగా బెడ్రూంలో పడు కోవాలనిగానీ, మొగుడు లేనప్పుడు పడకగదిని అందంగా తీర్చిదిద్దాలని కానీ దాని బుద్ధికి తోచలేదు. అందుకే అది బెడ్రూంలోకి వస్తే నాకు కంటగింపు.

కాని ఇప్పుడు సీత వంటింట్లో లేదు.

నేనీసారి స్టోర్ రూంలోకి వెళ్ళాను. అక్కడ వస్తు వులను రోజూ మార్చి సర్దుతుంటుంది సీత. కానీ ఈ రోజది అక్కడా లేదు.

మా యిల్లు కాస్త పెద్దది. అంత పెద్ద ఇంట్లో మే మిద్దరమే ఉంటున్నాం. పెళ్ళయి మూడేళ్ళు దాటింది. ఇంకా పిల్లలులేరు. అదీ ఒకందుకు మంచిదే అయింది. పిల్లలు పుడితే ఇప్పటికే అదోలా వున్న సీత అసహ్యంగా కూడా అయిపోతుంది. ఇప్పుడైతే దాన్ని ఎలాగో భరి స్తున్నాను. అప్పుడు భరించలేను.

పడకగదికి బయల్దేరాను.

అడుగులు నెమ్మదిగా వేస్తున్నాను.

చప్పుడు కాకుండా పిల్లిలా నడుస్తున్నాను.

ఇక్కడ కూడా సీత వుంటుందా, వుండదా? అయినా ఇంట్లో బొత్తిగా అలికిడి లేదేమిటి?

పడకగది సమీపించేసరికి కాస్త అలికిడి వినబడింది. అమ్మయ్య అనుకుని తేలికగా నిట్టూర్చాను. ఇల్లు ఇంత

నిశ్శబ్దంగా వుంటే—వంటింట్లోనూ, స్టోర్ రూంలోనూ సీత లేకపోతే—అది బహుశా ఎక్కడికో బైటకు వెళ్ళి ఉంటుందనీ—దొంగ ఎవడో యింట్లో ప్రవేశించి వుంటాడనీ భయం వేసింది. పడకగదిలో అలికిడి వినగానే నాకు కలిగిన తృప్తి ఇంతా అంతా కాదు. ఆ అలికిడి సీత చేయిది. ఆ చేతిని ఎప్పుడూ నిండుగా గాజులుంటాయి. అది కాస్త కదిలినా అవి గలగలలాడుతూంటాయి. గాజుల గలగల ఆగకుండా వినబడుతూనే వుంది.

ఏం చేస్తోంది గదిలో సీత? గాజుల గలగల అంత ఎక్కువగా ఉందేం?

గుమ్మంలోంచి తొంగి చూశాను.

అక్కడ నేను చూసిన దృశ్యం నన్ను నిశ్చేష్టుణ్ని చేసింది. సీతా—అని గట్టిగా అరవాలనుకున్నానుకానీ గొంతు పెగలలేదు. పెదవులు కదలలేదు.

మంచంమీద సీత, మరో పురుషుడు నగ్నంగా ఒకరినొకరు వాటేసుకుని వున్నారు.

ఇది నేనూహించని సన్నివేశం!

సీత చేతిని గాజులున్నాయి కాబట్టి చప్పుడవుతోంది.

నేను గుమ్మంలోకి వెళ్ళి నిలబడ్డాను. నా నీడ వారిని తాకిందో ఏమో ఇద్దరూ ఉలిక్కిపడి నాకేసి చూశారు.

"సీతా!" అంటూ అప్రయత్నంగా అరిచాను.

వాడు చటుక్కున లేచి నిలబడ్డాడు. మంచం పక్కగా వున్న లుంగీతీసి చుట్టబెట్టుకున్నాడు. నేను చూస్తూండగానే మంచంమీది పరుపు కాస్త కదిపి—అడుగున చేయి పెట్టి కత్తి ఒకటి తీసి—నాకు చూపించి బెదిరిస్తూ—"అరవకు. అరిస్తే చస్తావు—" అన్నాడు.

సీత మాత్రం మంచంమీద అలాగే కదలకుండా

పడుకుని నా వంకా, వాడి వంకా మార్చి మార్చి చూస్తోంది. నగ్నంగా వున్న తన శరీరాన్ని కప్పుకు నేందుకు కూడా ఆమె ప్రయత్నించడంలేదు.

"ఎవర్నువ్వు?" అన్నాను.

"దొంగని. డబ్బు దోచుకుందామని వచ్చాను. కానీ అంతకన్న విలువైనదే దొరికింది—" అన్నాడు వాడు. తర్వాత వాడు సీతను ఆజ్ఞాపించి నా రెండు చేతులూ వెనక్కి విరిచి కట్టించాడు. కాళ్ళు కూడా కట్టించాడు.

"ఇంక ఉంటాను మరి—గుడ్ బై మిస్టర్ .... థాంక్యూ సీతా!" అని వెళ్ళిపోయాడు వాడు.

అప్పుడు సీత బట్టలు కట్టుకుంది.

## 2

"ఎవరు వాడు?" తీవ్రంగా అడిగాను.

"తెలియదు. నేను వంటింట్లో పని చేసుకుంటుండగా బయటనుంచి వీధి తలుపు గెడ తీసుకుని వచ్చాడు. నన్ను బెదిరించి లోబర్చుకున్నాడు—" అంది సీత.

"బెదిరిస్తే లొంగిపోవడమేనా? వాణ్ని ప్రతిఘటించవద్దూ—బరితెగించిన ముండా!" అని తిట్టాను.

సీత నవ్వింది. నేనెప్పుడు తిట్టినా అది నవ్వుతుంది—"ఇప్పుడు మీరేంచేశారు చెప్పండి. నేను మీ చేతికి కట్లు కడితే చూస్తూ ఊరుకున్నారు కదా!"

కత్తిని చూసి నేను భయపడ్డాను. నిజమే! కానీ నేను మగవాణ్ని. నా ప్రాణాలు అమూల్యం. మరి సీత? అది ఆడది—దానికి ప్రాణంకంటె మానమే ముఖ్యం!—అదే చెప్పాను దానికి.

"మీరు చెప్పింది నిజమేనండీ. వాడు కత్తి చూపించినప్పుడా విషయం గుర్తుకు రాలేదు. ఈసారెప్పుడైనా

అలా జరిగితే ఈ విషయం గుర్తుంచుకుంటాను—" అంది సీత.

"మరో అవకాశంలేదు సీతు. ఒకసారి మానం పోగొట్టుకున్న స్త్రీని నేను ఆదరించలేను. నువ్వు చావనైనా చావు. ఎక్కడికైనా పో—నా కక్కరలేదు—నేను రెండో పెళ్ళి చేసుకుంటాను—" అన్నాను కోపంగా.

"నన్ను పొమ్మనకండీ—మీరు రెండో పెళ్ళి చేసుకోండి. అందువల్ల లాభం కూడా వుంది. ఏ దొంగైనా వస్తే ఇద్దరుంటాం కాబట్టి ప్రతిఘటించడానికి సులభంగా వుంటుంది—" అంది సీత.

హఠాత్తుగా నాకో విషయం గ్రహింపయింది. సీత తెలివిగా మాట్లాడుతోంది. నన్ను వేళాకోళంచేస్తోంది. తనకేదో అయిందన్న బాధగానీ, తన భవిష్యత్తు గురించిన భీతిగానీ దాని మాటల్లో గోచరించడంలేదు.

నా కోపం తారాపథం చేరుకుంది—"నేనే నిన్ను చంపేస్తాను!" అన్నాను.

సీత భయపడలేదు—"వద్దండీ! నన్ను చంపి మీరు సుఖపడలేరు. అనవసరంగా జైలుపాలవుతారు. మిమ్మల్ని ఉరి కూడా తీస్తారు...." అంది.

"ఏ పరిస్థితుల్లో నిన్ను చంపానో కోర్టులో చెప్పుకుంటాను. ఆవేశంలో చేసిన హత్యకు శిక్ష అట్టే ఉండదు—" అన్నాను నిరసనగా.

"మీ మేలు కోరేదాన్ని కాబట్టి ఇంతగా చెబుతున్నాను. నన్ను చంపేక కూడా మీకు ఉరి శిక్షపడక పోయినా భార్యను చంపిన మగవాడైనందుకు - మీకు ఎవరూ పిల్లనివ్వరు. ఇంకో పెళ్ళాం దొరకదు" అంది సీత.

ముందడుగు వేస్తున్నవాడినల్లా ఆగిపోయాను.

ఎంత తాపీగా మాట్లాడుతోంది! అది చెప్పే ఒకో మాటా నా గుండెల్ని పిండిచేస్తోంది. తను మాత్రం ఎక్కడా చలించడం లేదు.

"సీతా-ఆప్లే వాగకు. నిన్ను నేను చంపి నా చేతులు కళంకం చేసుకోలేను. పాపిష్టిదానా-ఎక్కడికి వెడతావో వెళ్ళిపో-" అన్నాను.

"నేను వెళ్ళిపోతే నలుగురూ మిమ్మల్ని చూసి నవ్వు తారండీ-పెళ్ళాం వదిలిపెట్టిన మగాణ్ని చూసి సమాజం వెటకారం చేస్తుందండీ-అసలే మీది సున్నిత హృదయం. అది మీరు భరించలేరు...."

"అలాగా-అయితే పోనీ నీది పాషాణ హృదయం కదా! మొగుడు వదిలిపెట్టిన పెళ్ళాంగా వెధవబ్రతుకు బ్రతుకుదువుగాని...." అన్నాను.

"మీరు నన్ను వదిలేస్తానంటే నాకు భయం వేస్తోంది. అప్పుడు నేను వాడితో వెళ్ళక తప్పదు-" అంది సీత బెదురుకళ్ళతో.

ఉలిక్కిపడ్డాను. "యేమిటన్నావ్?"

సీత వివరంగా చెప్పింది.

ఏకారణంచేతనైనా నేను సీతని వదిలిపెడితే వాడు పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాట్ట!

సీత ధైర్యం నాకర్థమైంది—"వాడితో పోవడం నీ కిష్టమేనా?" అన్నాను తీవ్రంగా.

"ఇష్టంలేదండీ-వాడంటే నాకసలు ఇష్టంలేదు. తాళి కట్టిన భర్త మీరు-మీరే దైవం. కత్తిచూపించి బెది రించాడు. అరిస్తే చంపేస్తానన్నాడు. తను చెప్పినట్లు విన మన్నాడు. ప్రాణభయంతో లొంగిపోయాను. ఇది తెలిస్తే నా భర్త నన్ను వదిలిపెట్టేస్తాడన్నాను. వదిలేస్తే నేను

పెళ్ళి చేసుకుంటానన్నాడు. భయపడవద్దన్నాడు. తప్పంటూ జరిగితే అది తనదేకానీ నాది కాదన్నాడు—" అంది సీత.

ఇప్పుడు నేను సీత మాటలు విని కాస్త ఆనందించ గలుగుతున్నాను.

"ఒకవేళ నేను పొమ్మంటే ఏం చేస్తావ్?"

"మీ కాళ్ళు పట్టుకుని గెంటినా—మీ పాదాలు వదలను. కానీ వాడు బలవంతంగా నన్ను తీసుకుపోతే యేం చేయను? ఆడదాన్ని—అబలను—అసహాయురాలను ..."

అసహాయురాలు సీత కాదు.... నేను.

"నువ్వు....పూర్తిగా వాడికి లొంగిపోయావా?"

"ఊఁ" అని సీత తల వంచుకుంది.

"ఛీ—" అనుకున్నాను. ఏంచేయాలో నాకు తోచ లేదు. నేనిప్పుడు పూర్తిగా అసహాయుణ్ని. నా భార్యని దొంగవెధవ చెరిచాడు. దాన్ని వదిలేద్దామా అంటే అది వాడితో పోయేలాగుంది. అది లేచిపోయిందని చెప్పుకుంటారంతా! అలాకాక దాన్ని చంపేద్దామా అంటే సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకోవడం అవుతుంది. నా శరీరానికింకా ఎన్నో కోర్కెలున్నాయి. అవన్నీ తీరకుండా దాన్ని జైలుపాలు చేయడం నాకిష్టం లేదు.

కాసేపు ఆలోచించాను. ఇందులో సీతదేమీ తప్పు లేదు. ఆ వెధవని నేనే ఏమీ చేయలేకపోయాను. తనేం చేస్తుంది? ఎన్ని కబుర్లు చెప్పినా ప్రాణం తర్వాతేమైనా? జరిగింది సీత కిష్టంలేదని చెబుతోంది. జీవితాంతం నా పాదాలదగ్గరేపడి ఉంటానంటోంది. అలాంటి దాన్ని దెబ్బలాడి యేం ప్రయోజనం?

కానీ—దాన్ని మరో పురుషు డనుభవించాడన్న ఆలోచన నా మనసును దహించేస్తోంది. నేను మామూలు మనిషిని కావడానికి చాలా సేపు పట్టింది.

ముందు కాసేపు బైటకు పోదామనుకున్నాను. కానీ-నేనలా బైటకు వెళ్ళగానే ఆ వెధవ మళ్ళీ వస్తాడేమోనని భయంవేసి ఇల్లు కదలలేదు. కానీ ఇల్లాల్ని తప్పించుకు తిరిగాను. అది ఎంతో బ్రతిమాలగా రాత్రి పదింటికి భోంచేశాను. తర్వాత మంచమెక్కి పడుకున్నాను. తనని నాదగ్గర పడుకోవద్దని శాసించాను.

అన్నీ తను మౌనంగా సహించింది. నా గదిలోనే ఓ చాప వేసుకుని పడుకుంది.

ఓ రాత్రివేళ నాకు మెలకువవచ్చింది. బెడ్ స్విచ్ నొక్కాను. గదంతా ప్రకాశవంతమైంది. ఓసారి కళ్ళు నులుముకుని చూశాన.

సీత చాపమీద పడుకునిఉంది. బట్టలు అ స్తవ్యస్తంగా ఉన్నాయి. కాసేపు నా చూపుల్ని మెనుంచి మరల్చలేకపోయాను. సీత చాలా అందగత్తె—అనిపించింది ఆ క్షణంలో.

చటుక్కున మంచం దిగి దగ్గరగా వెళ్ళాను. కుదిపి లేపాను.

మొద్దునిద్ర పోతోంది. ఓ పట్టాన లేవలేదు.

కాస్త వళ్ళుమండింది నాకు. అసలు దీనికింత నిద్రెలా పడుతోంది? ఓ పరాయిమగాడు—కత్తి చూపించి తన సర్వస్వమూ దోచుకుపోయాడే—అందుకు—ఇసుమంతైనా బాధ లేదా? ఎంత హాయిగా నిద్రపోతోంది?

కళ్ళు నులుముకుంటూ "యేమిటండీ!" అంది.

"సీతా—నిన్ను నేను క్షమిస్తున్నాను—" అన్నాను.

"ఎందుకు?" అంది మళ్ళీ గాజువళ్ళు విరుచుకుంటూ. తనలా వళ్ళు విరుచుకుంటూంటే నేను మరికాస్త ఆవేశపడ్డాను. ఎందువల్లనో అప్పుడు నాకామెపై కోపం కలగడంలేదు.

"జరిగినదంతా మర్చిపోదాం, మనిద్దరం ఎప్పటిలాగే ఉందాం—" అన్నాను.

సీత నిర్లక్ష్యంగా చాపమీదకు వాలి—"ఇది చెప్పడానికి ఇప్పుడు లేపారా?" అంది.

సీత నిర్లక్ష్యం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాంది. కానీ ఒక విషయం ఒప్పుకోవాలి. నిర్లక్ష్యానికి బదులు అది నా కాళ్ళు పట్టుకుని ఉంటే ఎప్పటికీ లాంగి ఉండేవాణ్ణి కాదు. దాని నిర్లక్ష్యం నాలో యేదో భయాన్ని సృష్టిస్తోంది. దాన్ని పోగొట్టుకుంటానేమోనని భయం వేస్తోంది. అదే దానిపట్ల నా ఆకర్షణను పెంచుతోంది.

సంభాషణ పెంచే ఉద్దేశ్యం నాకు లేదు— "పద మంచంమీద పడుకుందువుగాని...." అన్నాను.

సీత మాట్లాడలేదు. అప్పుడే నిద్రలోకి వెళ్ళిపోయింది.

తట్టి లేపాను. లేవలేదు.

నిద్రపోతోందా, నిద్రనటిస్తోందా? ముఖంచూస్తూంటే నిద్రపోతున్నట్లే ఉంది....నటనలా లేదు.

"అబ్బ....నిద్రపోనివ్వండీ!" అంటూ గునిసింది.

"నిద్రపోదువుగాని—ముందు మంచంమీదకురా—" అన్నాను.

"నేను లేవలేను—ఇక్కడే పడుకుంటాను—" కాస్త ముద్దగా అంది.

నేనెంత ప్రయత్నించినా తను లేవడంలేదు.

అప్పుడు నేనూ చాపమీదే పడుకున్నాను.

# 3

సీత ప్రవర్తన చాలా మామూలుగా ఉంటోంది. తన వల్ల తప్పు జరిగిందన్న విషయం నేనుతప్ప—తను గుర్తించినట్లులేదు. అది నాకు చాలా బాధగా ఉంది.

అయితే నాకిప్పుడు సీతను వదిలిపెట్టి ఉండడానికి భయంగా ఉంటోంది. వేళకు ఆఫీసుకువెళ్ళి ఇంటికి వచ్చేస్తున్నాను. సాయంత్రాలు తనను షికారుకు కూడా తీసుకువెళుతున్నాను. ఓ రోజున ఇద్దరంకలిసి సినిమాక్కూడా వెళ్ళాం. పెళ్ళైన మూడేళ్ళలోనూ మేం కలిసి చూసిన అయిదో సినిమా అనుకుంటానది! పెళ్ళానితో కలిసి సినిమా చూడ్డమంటే మహా చిరాకు నాకు.

సీతతో మాట్లాడినపుడల్లా—ఒకే ఒక తప్పుచేసి పతనమైపోయిన ఆడవాళ్ళ కథలు చెబుతూండేవాడిని. సమాజం వాళ్ళనెలాంటి చిన్నచూపు చూస్తుందో—వాళ్లెలాంటి నికృష్టపు చావు చస్తారో వివరించాను.

ఆ కథలన్నీ తను కుతూహలంగా వింది. వారిపట్ల జాలి చూపింది. తప్పితే తనూ అలాంటి స్థితికి చేరుతుందన్న భావాన్ని కళ్ళలో చూపలేదు. నా విశాల హృదయాన్ని గుర్తించనూ లేదు.

ఆమె ఈ ప్రవర్తన నాకు అర్థం కావడంలేదు. ఈ మార్పు ఆమెలో కొత్తగా వచ్చిందని మాత్రం నాకు అనిపిస్తోంది. నాకు నచ్చని మార్పు అది.

సీత గురించి ఆలోచించినపుడల్లా నాకు తలనొప్పి వస్తోంది. ఒకోసారి ఆ తలనొప్పి భరించలేనిదవుతోంది. రోజులు గడిచేకొద్దీ తలనొప్పి పెరుగుతోంది తప్పితే తరగడం లేదు.

నేను అసహాయుణ్ని, అసమర్థుణ్ని అయ్యానని నా

మనసు నన్ను వేళాకోళం చేస్తోంది. అది నిజమేనని నాకూ అనిపిస్తోంది.

ఒకరోజు మధ్యాహ్నం ఆఫీసులో అలాంటి పరిస్థితే ఏర్పడి—మధ్యాహ్నం సెలవు పెట్టి ఇంటికి వెళ్ళిపోయాను. ఇంటికి వెళ్ళగానే నా మొదటి అనుమానం—తలుపు గడియ వేసి వుండదని!

తలుపు తోశాను. గడియ వేసి ఉంది. తృప్తిగా నిట్టూర్చి కాలింగ్ బెల్ మ్రోగించాను.

ఒక్క నిముషం ఆగాను. అడుగుల చప్పుడు ఇంకా వినిపించలేదు. అసహనంగా మళ్ళీ కాలింగ్ బెల్ మ్రోగించాను. మరో నిముషం గడిచినా ఎవరూ వస్తున్న చప్పుడవలేదు.

అలా ఆగకుండా కాలింగ్ బెల్లు మ్రోగిస్తూనే ఉన్నాను. అయిదు నిముషాలలా గడిచాక అడుగుల చప్పుడు వినిపించింది.

ఆలస్యానికి సీతను మన్నించకూడదు. చెడామడా తిట్టాలి—అనుకున్నాను.

"పాపం—నిద్రపోతోందేమో—" అనిపించింది మళ్ళీ! మనసేమో వేళాకోళం చేసింది—ఈ మధ్య నువ్వు సీతను తిట్టడానికి భయపడుతున్నావు—అంటూ!

తలుపు గడియతీసిన చప్పుడయింది. తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా........

కాసేపు నా గుండె వేగంగా కొట్టుకుంది. మెదడు పని చేయలేదు. కళ్ళుమసకలుకమ్మేశాయి. సర్వేంద్రియాలూ స్తంభించిపోయాయి! ఒక్క మాటలో చెప్పాలంటే నేను నిశ్చేష్టుణ్నయ్యాను.

వాడు—ఆ దొంగ వెధవ.

"నేను వెళ్ళిపోతున్నాను. సీత బట్టలు కట్టుకుంటోంది—" అని వాడు ఆక్కణ్ణించి మెరుపు వేగంతో వెళ్ళిపోయాడు.

నాలో సంతరించుకోబోయిన చేష్టలు మళ్ళీ ఆగిపోయాయి. వాడు వెళ్ళిన ఒక్క నిముషానికి లోపలకు పరుగుత్తాను! తలుపు గడియవేయాలన్న ధ్యాస కూడా నాకు కలగలేదు. నేను లోపలకు వెళ్ళేసరికి పడకగదిలో సీత చీరకుచ్చెళ్ళు దోపుకుంటోంది! నన్ను చూసి తాపీగా—"ఈరోజు పెందరాళే వచ్చేశారే?" అంది.

ఆవేశం తారాస్థాయి నందుకుంది నాకు! సాచి లెంపకాయ కొట్టాలనిపించింది. కానీ ఆమెను సమీపించనైనా లేదు నేను. అలా దూరంగానే నిలబడి—"యేవిటిదంతా?" అన్నాను.

"వాడు మళ్ళీ వచ్చాడు!" అంది సీత.

"మళ్ళీ కత్తి తెచ్చాడా?" అన్నాను వెటకారంగా.

"లేదండీ—మీ మాటలు గుర్తున్నాయి. మళ్ళీ కత్తి తెస్తే ప్రాణాలు పోయినా మానం కాపాడుకుందామనుకున్నాను, కానీ...." అని ఆగింది సీత.

"కానీ—యేమయింది?"

"వాడు నా అందాన్ని పొగిడాడు. నా నడకల్ని పొగిడాడు, నా మాటల్ని పొగిడాడు. అలా పొగిడితే నాకెంతో బాగుందండీ! నా అందాన్ని చూసి, నన్ను ప్రేమించి కోరిన మొట్టమొదటి మగాడు వాడు. వాణ్ణి నేను కాదనలేకపోయాను—"

"నీకు పెళ్ళయిందనీ—మొగుడున్నాడనీ గుర్తుందా?"

"అదేంటండీ—ఒకసారి మీరేమన్నారో గుర్తు లేదా?"

అంది సీత.

"ఏమన్నాను?" అన్నాను తీవ్రంగా.

"ఆ రోజు మన పెళ్ళిరోజు. మీరు ఆఫీసునుంచి పెందరాళే వస్తారని ఎదురుచూశాను. కానీ మీరు ఆల శ్యంగా వచ్చారు. అదీ ఒంటరిగాకాదు...."

ఇల్లాలు చెబుతూంటే కాసేపు నాకు నోట మాట రాలేదు.

## 4

"ఈమె పేరు రాధ. మేమిద్దరం భోంచేసే వచ్చాం. నువ్వు భోంచేసేయొచ్చు—" అన్నాను.

సీత మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోయింది. మేమిద్దరం డ్రాయింగ్ రూంలో కూర్చుని కబుర్లు చెప్పు కుంటున్నాం. ఓ అరగంట పోయాక సీతవచ్చి—"రాధకు పక్క ఎక్కడ వేయమంటారు?" అనడిగింది.

"రాధ మానసికంగా దెబ్బతింది. ఒంటరితనం అంటే భయం. కొద్ది రోజులు మనింట్లో ఉంటుంది. పడక నా గదిలోనే—" అన్నాను.

"అలా ఎలా కుదురుతుందండీ?" అంది సీత.

"ఏం ఫరవాలేదు. రాధ వున్నన్నాళ్ళూ నువ్వు వేరే గదిలో పడుకో—" అన్నాను.

చిన్నప్పట్నుంచీ నేను విలాస పురుషుణ్ని. ఆడ వాళ్ళంటే నాకు మోజు. కాలేజీలో చదువుకునే రోజుల్లో ఎలాగో రాధను లోబర్చుకున్నాను. రాధకు మంచి సంబంధం రాగా చదువు మధ్యలో మానిపించి పెళ్ళి చేసేశారు. పెళ్ళయిన రెండేళ్ళకు రాధ మొగుడు పోయాడు. విధవ అయిందామె. అప్పుడు తనెక్కడో

ఉద్యోగం సంపాదించుకుంది. ట్రాన్స్‌ఫర్ మీద నిన్న నే ఈ ఊరు వచ్చింది.

రాధకు మళ్ళీ పెళ్ళి కష్టంగానే ఉంది కానీ మగ తోడు కష్టంగాలేదు. నిన్న మా ఆఫీసులో ఆమె తటస్థ పడగానే మాకు మా పాత పరిచయాలు గుర్తొచ్చాయి. రాధకు నేనంటే ఇంకా మోజు పోలేదు. మా ఇంట్లో వచ్చి వుండు—అన్నాను.

"పెళ్ళయిన వాడివికదా!" అని తటపటాయించింది రాధ.

"మొగుణ్ని బోగందాని ఇంటికి మోసుకెళ్ళేటంతటి పతివ్రత నా పెళ్ళాం—" అని చెప్పాను రాధకు.

రాధకు పెళ్ళిచేసుకుని సుఖంగా బ్రతుకుతున్న ఇల్లాళ్ళంటే కక్ష వుంది. తనను పెళ్ళిచేసుకోకుండా వాడుకుని గడిపేస్తున్న మగాళ్ళంటే కక్షలేదు. ఆడదాని అన్యాయంతా ఆడదాని మీదే! అందుకే మగవాడు వాళ్ళని అదుపు చేయగల్గుతున్నాడు. నేనూ రాధను మళ్ళీ నా గదిలోకి తెచ్చుకోగలిగాను.

సీతను వేరే గదిలో పడుకోమనగానే దాని ముఖం మాడిపోయింది. రాధ ముఖం వెలిగింది.

"ఇది అన్యాయమండీ—" అంది సీత.

"నేను అన్యాయాలు చేయను. రాధ నేనంటే మోజు పడి వచ్చింది. నీ దరిద్రపు ముఖాన్ని చూసి ఏ మగాడైనా మోజుపడితే నువ్వూ వాణ్ని తెచ్చుకో. అప్పుడు నేను వేరే గదిలో పడుకుంటాను—" అన్నాను తేలికగా నవ్వుతూ.

సీత ఏడ్చింది. తనది దరిద్రపు మొహం అని నేను చాలాసార్లు అన్నాను. ఎప్పుడూ ఏడవలేదు. మరో ఆడ

దాని ఎదురుగా అలా అన్నందుకు ఏడుస్తోందది. ఆ ఏడుపు నాకు ఏమాత్రం బాధ కలిగించడంలేదు.

ఎందుకంటే రాధ నవ్వుతోంది. ఆమెతోపాటు నేనూ నవ్వుతున్నాను.

సీత అలా ఏడుస్తూండగానే మేమిద్దరం వెళ్ళి గది తలుపులు వేసుకున్నాం.

## 5

"ఇదన్నమాట కథ!" అనుకున్నాను. సీత నామీద ప్రతీకారం తీర్చుకుంటోంది.

నావల్ల తను మానసికంగా చాలా హింసపడింది. అదెలాంటి హింసో నా కిప్పుడు అర్థమవుతోంది.

సీత చదువులేనిది కాదు. బియ్యే రెండేళ్ళు చదివింది. సీత అనాకారికాదు—అవయవ పుష్టి కూడా వుంది. సీతకు వంటబాగా వచ్చు. సీతకు నాపై ప్రేమ వుంది. నాతో పెళ్ళి జరిగినపుడు పదివేల కట్నం కూడా తెచ్చిందామె.

మరి నేను సీతనెందుకు ద్వేషిస్తున్నాను....?

నిజానికి నేను సీతను ద్వేషించడంలేదు. అదంటే నాకు చులకన భావం. అది నా పెళ్ళాం. నా కాలికింద చెప్పు. నా బానిస—ఇవీ దానిగురించి నా అభిప్రాయాలు.

పూర్వకాలం బానిసల్ని హింసించి ఆనందించే ఆచార ముంది. అదే జాతికి నేనూ చెందుతాను.

ఇప్పుడు సీత తెగించింది. తనూ నా పద్ధతుల్నే అనుస రిస్తోంది.

సీత నాతో సమంగా అరిచి వాదించినా, కొడితే అల్లరిపెట్టినా నేను దాన్ని ఏమైనా చేయగల్గి వుండే వాణ్ని. కానీ అది చాపకింద నీరులా ప్రవర్తిస్తోంది. తడి గుడ్డతో గొంతు కోస్తోంది.

"సీతా!" అంటూ అరిచాను.

సీత భయపడకుండా నా వంక అదోలా చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆ చూపుల్లో రవంత గర్వం కూడా వుంది. గర్వపడక ఏం చేస్తుంది? దాని అందాన్ని ఏనాడూ నేను పొగడలేదు. ఈ రోజు ఒకడు దాని అందాన్ని పొగిడాడు. ఇప్పుడు దానికి నా పొగడ్తలు అవసరంలేదు.

"ఏం చెయ్యాలి— నేనిప్పుడు?"

ఆలోచించగా ఒక్కటే స్ఫురిస్తోంది—సీతను చంపేయాలి!

వంటింట్లోకి వెళ్ళాను—"సీతా—నిన్ను చంపేస్తాను" తాపీగా అన్నాను.

"మీకు భార్యనైన మరుక్షణమే—మనిషిగా ఏనాడో నేను చచ్చిపోయాను. నన్ను మీరు చంపుతానంటే నాకు నవ్వొస్తోంది—" అంది సీత.

సీత చాలా తెలివిగా మాట్లాడుతోంది. నాలో ఏదో బలహీనత వుంది. అందువల్లనే నేను దాన్నేమీ చేయలేక పోతున్నాను—"నన్నెందుకిలా చంపుతున్నావ్ సీతా!" అన్నాను.

"మిమ్మల్ని చంపడం నాకు చాలా సులభం. నేను వండిన వంట తిని బ్రతుకుతున్నారు. మీకు మంచినీళ్ళు దగ్గర్నుంచి అన్నీ నేనే అందిస్తాను మీకు. కానీ నేను మిమ్మల్ని చంపలేను. ఎందుకంటే అంత సులభంగా మీరు చావకూడదు. మీరు నన్నెలా చంపుతున్నారో— నేనూ మిమ్మల్నలాగే చంపాలి—"

"నీకా అవకాశం ఇవ్వను. ఇప్పుడే నేను నిన్ను చంపేస్తాను—" అంటూ చటుక్కున ముందుకు వెళ్ళి దాని

గొంతు పట్టుకున్నాను. అది అరవాలని ప్రయత్నించింది కానీ నోరు నొక్కేశాను. ఇప్పుడు నాలో విపరీతమైన ఆవేశం పొంగుకొస్తోంది. ఒక మనిషిని చంపడానికి తగ్గ ఆవేశం నాకున్నదిప్పుడు.

నా చేయి దాని కంఠం చుట్టూ బిగుస్తూండగా ఎవరిదో బలమైన చేయి నా భుజం మీద పడింది. ఉలిక్కిపడి నా పట్టు వదిలి వెనక్కి తిరిగాను.

సీత గొంతు సవరించుకుంటోంది. దాని కళ్ళలో భయం మాత్రం లేదు.

వెనకాలవున్నది పక్కింటి పార్వతీశం.

"మిస్టర్—నువ్విప్పుడో హత్య చెయ్యబోయావు. అందుకే నేనే సాక్షిని!" అన్నాడు పార్వతీశం.

నాకు కాళ్ళూ, చేతులూ వణికాయి. ఓ క్షణం ఆగి—
"నువ్విక్కడికెందుకొచ్చావ్?" అడిగాను.

"న్యూస్ పేపర్ కోసంవస్తే—ఈ గొడవ కళ్ళబడింది—"

"న్యూస్ పేపరుకోసం పరాయిళ్ళలో వంటింట్లోకి రావడం మంచి అలవాటుకాదు. గుర్తుంచుకో!"

"అది మంచి అలవాటేనని నాకిప్పుడనిపిస్తోంది. ఆ విధంగా ఒక నిండు ప్రాణాన్ని రక్షించగలిగాను—"

"భార్యాభర్తల గొడవల్లోకి కలగజేసుకోకు. నేనేం నా భార్య ప్రాణాలు తీయబోవడం లేదు. మేమేదో నాటకం రిహార్సల్సు వేస్తున్నాం—" అన్నాను.

"అదే నిజమైతే నీ నటనాశక్తి అద్భుతం. నువ్వు నిజంగా హత్య చేస్తున్నావనే అనుకున్నాను. కానీ నీ కల్పనాశక్తి బాగున్నట్టులేదు. ఎందుకంటే నువ్వు చెప్పింది నిజంగా తోచడంలేదు. అందుచేత నువ్వు

చెప్పింది నిజమేనని నీ భార్య కూడా అంటే వెంటనే వెళ్ళిపోతాను—" అన్నాడు పార్వతీశం.

"పార్వతీశంగారూ! సమయానికి వచ్చి నా ప్రాణాలు కాపాడినందుకు మీ ఋణం వుంచుకోను. నా భర్త నన్ను హత్య చెయ్యాలని ప్రయత్నించాడు. ఇలాంటి ప్రయత్నమొకటి జరిగినట్లు గుర్తుంచుకుని అవసరమైనప్పుడు పోలీసులకు చెప్పండి. ఇకమీదట నా భర్త మళ్ళీ ఇలాంటి ప్రయత్నం చేయరని నా నమ్మకం. కాబట్టి మీరింక వెళ్ళిపోవచ్చు—" అంది సీత.

పార్వతీశం వెళ్ళిపోయాడు.

నాలో కోపం తగ్గలేదు కానీ నిస్సహాయంగా సీతవంక చూశాను.

"మీరు నన్ను హత్యచేయబోవడానికి ప్రయత్నించారనడానికి ఓ సాక్ష్యం ఏర్పడింది. ఇంక మీరు చంపినా నాకు బాధలేదు. మీకు శిక్ష తప్పదు—" అంది సీత.

"అంటే ముందే ఇదంతా ఏర్పాటు చేసుకున్నావా?" అన్నాను.

"మూడేళ్లుగా మీతో కాపురం చేస్తున్నాను. మీరు ఏ క్షణంలో ఎలా ప్రవర్తిస్తారో ఆ మాత్రం అర్థంచేసుకోలేనా? ఎటొచ్చీ మీరే నన్నెప్పుడూ అర్థంచేసుకోడానికి ప్రయత్నం కూడా చేయలేదు?"

సీత చెప్పింది నిజమే! నా అహంకారంతో దాన్ని శాసించడమేగానీ—అర్థంచేసుకునే ప్రయత్నంచేయలేదు. నేను చేయాలని కూడా అనుకోలేదు.

"అంటే సరిగ్గా సమయానికి పార్వతీశాన్నిక్కడికి రమ్మన్నావన్నమాట—"

"అవును—" అంది సీత నిశ్చలంగా.

"వాడు నీమాట అంత కచ్చితంగా ఎందుకు పాటించాడు?"

"రెండు వారాలుగా ఆయన భార్య పుట్టింట్లో లేదు."

"లేకపోతే?" కంగారుగా అన్నాను.

"వాళ్ళకూ మనకూ దొడ్డి ఉమ్మడి. ఎవరూ చూడకుండా ఆయన మనింటికి వచ్చే అవకాశముంది—"

"ఉంటే?"—ఈసారి కంగారుకు ఆవేశం జతపడింది.

"నా ముఖాన్ని మీరు దరిద్రపు ముఖంగా భావించారు. ఏ మగాడూ మోజుపడడన్నారు. పార్వతీశానికీ మీకూ అభిప్రాయాల్లో తేడా వుంటుందేమో చూడాలనిపించింది. చూశాను...."

"చూస్తే?"

"ఆయనవీ, మీవీ ఒకే రకం అభిప్రాయాలు కావని పదిరోజుల క్రితమే తేలింది. ఆఖరికి పరాయి ఆడదాన్ని అనుభవించడం విషయంలో కూడా ఆయన అభిప్రాయం మీతో కలవదు. అలాంటి పనులు భార్యకు తెలియకుండా చేయాలంటాడాయన...."

"యూ .... యూ .... బ్లడీ .... నువ్వు వాడితో కూడా...." అన్నాను. వాక్యం పూర్తి చేయలేదు.

సీత చక్కగా నవ్వి—"అందుకే ఈ రోజు చెప్పిన సమయానికి వచ్చాడాయన—" అంది.

నేను మళ్ళీ సీతను సమీపించి కంఠంపై చేతులు వేశాను.

సీత అరవడానికి కూడా ప్రయత్నించలేదు—"ఒక్క మాట వినండి! ఇప్పుడు మీరు నన్ను చంపడం సంగతి అటుంచండి. ఏ విషమో మింగి నేను ఆత్మహత్య చేసుకున్నా మీకే ప్రమాదం. అనవసరంగా మీకు నా

ప్రాణాల్ని రక్షించాల్సిన బాధ్యత కల్పించాను-"

అప్రయత్నంగా నా పట్టు విడిపోయింది.

సీత నెమ్మదిగా అంది—"మీ మేలుకోరి చెబుతున్నాను. వేళకాని వేళల్లో ఇంటికి రాకండి. అందువల్ల అనవసరంగా ఆవేశపడడమూ హత్యా ప్రయత్నాలు చేయడమూ తప్ప మరో ప్రయోజనముండదు. నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వండి. మీ ఇష్టం వచ్చినట్లు మీరు బ్రతకండి—"

## 6

రాధతో కాసేపు ఒంటరిగా మాట్లాడాలని చెప్పాను. ఆమె అంగీకరించింది.

రాధ ఉద్యోగానికి వచ్చిన కొత్తలో మా యింట ఓ వారం రోజులుంది. ఆ వారం రోజులు నా కెంతో హాయిగా గడిచాయి. కానీ తర్వాత రాధ వెళ్ళిపోయింది. ఆమెకు వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో గది దొరికింది. ఆ తర్వాత రాధ నాకు మరి అవకాశమివ్వలేదు.

పార్కుకి వెళ్ళాం ఇద్దరం. అక్కడ నేను నా కథ పూర్తిగా ఆమెకు చెప్పాను.

రాధ ఆశ్చర్యపడింది. "సీత—నీమీద తిరగబడిందా? అలాంటి దానిలా కనబడలేదే!" అంది.

"నువ్వేమిటి—అనుభవిస్తున్న నేనే—సీత ఇలా ప్రవర్తిస్తోందా అని ఆశ్చర్యపోతున్నాను. దానికేంలేగానీ నువ్వు నాకో సాయం చేయాలి—"

"ఎలాటి సాయం?"

"సీత దుష్ప్రవర్తనను ఋజువు చేయాలి. అది రుజువైతే దానికి నేను విడాకులిచ్చేస్తాను—"

"అందువల్ల నాకు లాభమేమిటి?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను—" అన్నాను.

"నిజంగా?" అంది రాధ కళ్ళు రెపరెపలాడిస్తూ.

"కావాలంటే కాగితం కూడా రాసిస్తాను...." అన్నాను.

"అయితే ఏం చేయాలో చెప్పు!" అనడిగింది.

"మా యింటిపక్క ఓ పార్వతీశం వున్నాడు. సీత వాణ్ని కూడా బుట్టలో వేసుకుంది. నీ అందం ముందు సీత బలాదూర్! కాబట్టి నువ్వు పార్వతీశాన్ని బుట్టలో వేసుకోవాలి. పార్వతీశం ద్వారా సీత ప్రవర్తన మంచిది కాదనీ, మగాళ్ళకి పోజులు కొడుతుందనో, ఆమె ఒకరిద్దరు పురుషులతో అక్రమసంబంధం కలిగివుండడం కళ్ళారా చూసినట్లూ చెప్పించాలి. వీలుంటే అలాంటి ఫోటోలు కూడా తీసే ఏర్పాటు చేయించాలి—" అన్నాను.

అన్నింటికీ తలఊపింది రాధ! నేనామెకు పార్వతీశానికి సంబంధించిన వివరాలన్నీ ఇచ్చాను. అతగాడి ఫోటో ఆఫీసు అడ్రసు ఇచ్చాను.

"మనిషి బాగున్నాడు—నీకంటే కూడా!" అంది రాధ.

రాధ కామెంట్ నాకు నచ్చలేదు.

## 7

రాధ పార్వతీశాన్ని ఆఫీసులోనే కలుసుకుంది. ఇద్దరూ ఓ పక్కగా వెళ్ళారు.

"నేను సూటిగా మాట్లాడతాను. మీ కభ్యంతరముండదనుకుంటాను—" అంది రాధ.

"అందమైన ఆడవాళ్ళు సూటిగా మాట్లాడితేనే అందం—" అన్నాడు పార్వతీశం.

"నేనందమైనదాన్నని ఒప్పుకున్నారు, అంటే నేను

మీకు నచ్చాను. నేను నీకు కావాలా?"

"కావాలి—కానీ పెళ్ళిచేసుకోను—" సూటిగా చెప్పాడు పార్వతీశం.

"పెళ్ళిమీద నాకూ ఆసక్తిలేదు. ఎటొచ్చీ ఓ సాయం కావాలి—"

"యేమిటది?"

రాధ చెప్పింది. పార్వతీశం కాసేపు తటపటా యించాక—"అది పెద్ద కష్టంమేంకాదు. కానీ నీపని అయ్యాక నువ్వు నన్ను మోసంచేస్తే—" అన్నాడు.

"ఆ భయంలేదు. ఆడ్వాన్సుంటుంది. పని పూర్త య్యాక మళ్ళీ మరోసారి. ఆ తర్వాతగూడా అప్పు డప్పుడు...." అంది రాధ.

పార్వతీశం లొట్టలు వేసుకుంటూ-"అంతా బాగానే ఉంది, కానీ నువ్వు మా ఇంటికొస్తే బాగుండదు. పక్కిం టావిడ ఇంటికే రా! మాది ఉమ్మడి దొడ్డి. నిన్ను నేను ఎలాగో కలుసుకునేందుకు ప్రయత్నిస్తాను-" అన్నాడు.

"పక్కింటికి వస్తే ఎలా? వాళ్ళకూ నీకూ పరిచయ ముందా?" అంది రాధ.

"నీలాంటి ఆడది కోరితే పరిచయమెంత సేపు?" అన్నాడు పార్వతీశం.

అతను చెప్పిన ప్రకారం ఆ సాయంత్రం నేను ఇంటికి రాకూడదు, రాధ మా యింటికి వెళ్ళాలి.

రాధ అలాగే చేసింది. నేను మొదటాట సినిమాకు పోయాను.

సీత, రాధను సాదరంగా ఆహ్వానించి—"మా వారు పక్కి నిన్ను మా యింట్లో మకాం పెట్టమన్నారా?" అని అడిగింది.

"లేదు, వేరే పనిమీద వచ్చాను—" అంది రాధ.

"ఏమిటాపని?" కుతూహలంగా అడిగింది సీత.

"ఎవరితో చెప్పనని మాటిస్తే చెబుతాను—" అంది రాధ. సీత మాటిచ్చింది-"డబ్బు అవసరం నన్ను పతితను చేసింది. మీ పక్కింటి పార్వతీశం రసికుడని విన్నాను. ఈరోజే కలిశాను. అడిగిన డబ్బిస్తానన్నాడు. మీయింటి గుండా ఆయనింటికి వెళ్ళి మళ్ళీ మీ యింటిగుండానే వెనక్కు వచ్చేస్తాను—" అంది రాధ.

"నువ్వు నాకు నచ్చావు. చాల సూటిగా మాట్లాడుతున్నావు—" అంది సీత.

"నేనెప్పుడూ సూటిగానే ప్రవర్తిస్తాను—" రాధ నవ్వుతూ అంది.

"అయితే నేను కూడా సూటిగా నీకో విషయం చెప్పేదా?" అంది సీత.

"చెప్పు—" అంది రాధ.

"పార్వతీశం నా ప్రియుడు. చూస్తూ చూస్తూ మరో ఆడదాన్ని నా ప్రియుడికెలా అప్పగించేది?"

రాధ ఆశ్చర్యపోయింది. సీత ఇంత ధైర్యంగా నిజాన్ని ఒప్పుకుంటుందని ఆమె అనుకోలేదు. అసలు సీత పతిత అన్న నిజం కూడా ఆమె నమ్మలేదు. కొన్ని కారణాలవల్ల నేనామెకు అబద్ధం చెప్పి వుండవచ్చునని ఆమె విశ్వసిస్తోంది.

"పెళ్ళయింది నీకు. అన్నివిధాలా అదృష్టవంతురాలివి. నీ కిదేం బుద్ధి?" అంది రాధ.

"కారణం చెప్పనా?" అని సమాధానం కోసం ఎదురు చూడకుండానే చెప్పసాగింది సీత—

"నా భర్త మనిషి కాడు. మృగం. తను మృగం కాబట్టి

నేనూ మృగాన్నే భావించాడు. అలాగే హింసించాడు. నాలుగు తలుపులూ వేసి బంధిస్తే పిల్లి కూడా ఎదురు తిరుగుతుంది. కానీ ఆడది ఎదురు తిరగదు. ఇలాంటి ఆడదాని చరిత్రకు నాతో స్వస్తి చెప్పాలనుకున్నాను. అందుకే ఎదురు తిరిగాను.

నిజానికి నా భర్త హీరో ఏమీ కాడు. మగాడు కాబట్టి హీరో అయ్యాడు. ఆయన ఎందుకూ పనికిరాని, ఏమీ చేతకాని చవటమనిషి. ఆ విషయాన్ని ఋజువు చేయదల్చుకున్నాను. నా గురించి అన్నీ తెలిసికూడా నన్నేమీ చేయలేని ఆ మనిషిని అనుక్షణమూ హింసించడమే నా ధ్యేయం.

నువిక్కడికెందుకొచ్చావో తెలియదుకానీ—నిన్ను నా భర్త పురమాయించి వుంటాడని ఊహించగలను. నువ్వూ ఆడదానివి నేనూ ఆడదాన్ని. నువ్వొప్పుకున్నా ఒప్పుకోకపోయినా మగాళ్ళవల్ల నీకూ ఎన్నో అన్యాయాలు జరిగాయి. నువ్వు కూడా నాతో చేతులు కలుపు. ఆయన్ను హింసించడానికి సహకరించు. ఆడదీ ఆడదీ చేతులుకలిపితే కానీ ఈ మగాళ్ళకు బుద్ధి రాదు—"

రాధ సీత ఉపన్యాసం ఓపికగా విని—"నేనింక పార్వతీశం కోసం ప్రయత్నించను. నీకు జయం కలగాలని కోరుకుంటున్నాను—" అని అక్కణ్ణించి వెంటనే వెళ్ళిపోయింది.

# 8

జరిగింది యథాతథంగా రాధ నాకు చెప్పింది.

"అయితే ఇప్పుడేమంటావ్?" అనడిగాను.

"నేను నీకు సహకరించలేను. నీ భార్యకు సహకరించకుండా ఉండడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. కానీ

ఆమె ఆడది. నేనూ ఆడదాన్ని. నీ కారణంగా మా యిద్దరికీ అన్యాయం జరిగిందని నాకు అనిపిస్తోంది. ఒక వేళ నేను కూడా నీకు ఎదురు తిరిగినా ఆశ్చర్యంలేదు—" అని వెళ్ళిపోయింది రాధ.

అప్పుడు నేను కాస్త భయపడ్డాను. సీతలో ఏం ప్రభావం వుంది? ఆమె నా ఊహాలన్నీ ఎలా చదవ గల్గుతోంది? నా పథకాల నెలా తిప్పికొట్టగల్గుతోంది?

ముందుగా నేను చేయవలసిన పని ఒకటుంది.

కొంతకాలంపాటు నేను సీతతో చాలా అన్యోన్యంగా ఉండాలి. మా అన్యోన్యత నలుగురి దృష్టిలోనూ పడాలి. అది కొంతవరకూ అయినా నాకు సాక్ష్యంగా పని కొస్తుంది.

## 9

మేము కలిసి సినిమాలు చూశాం. పార్కులకు వెళ్లాం. బీచిలో తిరిగాం.

ఇప్పటి సీత ఇదివరకటి సీతకాదు. ఆమె బట్టలు కట్టడంలోనే ఒక కొత్త తీరు ప్రదర్శిస్తోంది. ఆమె డ్రస్ చేసుకుని బయల్దేరితే—అందాల పోటీలో గెల్చివస్తున్న దానిలా కనబడుతోంది.

నా మటుక్కు సీత పెద్ద అందగత్తె అనిపించదు. కానీ ఇప్పుడామెలో ఆకర్షణ చాలా పెరిగింది. మే మిద్దరం కలిసి బయట తిరుగుతున్నప్పుడు—ఆమె పక్కన నేను కాస్త తీసినట్లుగా వున్నట్లే అనిపిస్తోంది. అందులోనూ చాలామంది మగవాళ్ళ చూపులు ఆమె వైపే ప్రసరిస్తున్నాయి. అది నాకు ఇబ్బందిగా కూడా వుంటోంది. సీత మాత్రం అందుకు సంతోషిస్తున్నట్లు కనిపిస్తుంది. అంతేకాదు మగవారిని ఆకర్షించడానికామె ప్రయత్ని

స్తున్నట్లు కూడా అనిపిస్తుంది.

నాతో బయటకు వచ్చినప్పుడు సీత పైట తరచుగా జార్చి వేసుకుంటోంది. నా స్నేహితులెవరైనా ఎదురుపడి మాట్లాడుతూంటే జారిన పైటను అలా చేతులమీద నే ఆపివుంచి—చాలాసేపు వాళ్ళ చూపులు ఆమె హృదయ భాగంపై గుచ్చుకున్నాక-అప్పుడు పైట వేసుకుంటోంది. చిలిపిగా నవ్వడం, కొంటెగా చూడడం, చిన్న చిన్న ఇంగ్లీషు పదాలు వాడడం మొదలెట్టింది.

మొత్తంమీద నాకే సీతపట్ల ఆకర్షణ పెరగడం మొదలయింది.

ఇంట్లో కూడా సీత నన్ను ఇదివరకటిలా చనువుగా వుండనివ్వడంలేదు. ప్రతిఘటిస్తోందికూడా. ఇదివరకటిలా ఆమె ప్రతిఘటనను నేను నిర్లక్ష్యం చేయలేక తున్నాను. ఫలితంగా మధురంగా గడపవలసిన ఎన్నో రాత్రులు నాకు నిరాశను కలిగించాయి.

ఏది ఏమైనా నేను భరిస్తున్నాను. ఎందుకంటే మా అన్యోన్యతకు వ్యతిరేకంగా ఎక్కడా సాక్ష్యం లభించ కూడదు.

గత రెండు మాసాలుగా మేము చాలా ఫోటోలు తీయించుకున్నాం. ఎందరో స్నేహితులు మా అన్యోన్యతను ప్రశంసించారు. "మేడ్ ఫర్ ఈచ్ అదర్" అన్నారు చాలామంది.

ఇలా తిరగడం నాకు బాగుంది. కానీ ఈ తిరగడం సీత ॥ చంపడం కోసమన్న విషయం మనసుకు బాధను కలిగిస్తోంది. అయినా సరే నేను చేయగలిగిందేమీలేదు.

కోరినపుడల్లా నాకు లొంగకపోయినా సీత నా ఆప్యాయతకు కరిగిపోతున్నట్లే వుంది. అది మెత్తబడు

తోందని కూడా నాకు అనిపించింది.

ఒకరోజున నేను దానికి ఒక ఉత్తరం రాశాను.

"సీతా!

నీ మొగుడు నిన్నాదరిస్తున్నాడని నన్ను
నిర్లక్ష్యం చేస్తున్నావు కదూ! నిన్ను నలుగురూ
చూస్తూండగా సునాయాసంగా హత్య చేయగలను.
ఇది నీకు నా మొదటి హెచ్చరిక—

నీ మాజీ ప్రియుడు—"

దస్తూరీ తెలీకుండా వుండడం కోసం ప్రతి అక్షరాన్నీ అష్టవంకర్లతో రాశాను. ఉత్తరం పోస్టుచేశాక దాన్ని నేనే రిసీవ్ చేసుకున్నాను. సీతకు చూపించలేదు.

నాలుగు రోజులాగి అలాంటి ఉత్తరాన్నే రెండో హెచ్చరికగా రాశాను. ఆ ఉత్తరం కూడా నా దగ్గరే ఉంచుకున్నాను.

మరో మూడ్రోజులాగి మూడో ఉత్తరం పోస్టు చేశాను. మర్నాడు పోస్టులో రాలేదు నాకా వుత్తరం. ఒక్కోసారి లోకలు పోస్టులో కూడా ఉత్తరాలు ఆలశ్యం అవుతూంటాయి. నేను పెద్దగా కంగారు పడలేదు. మర్నాడొస్తుందిలే అనుకున్నాను.

ఆ ఉత్తరం కూడా వచ్చేక మరో రెండ్రోజులాగి సీతను బీచికి తీసుకు వెళ్ళాలనుకున్నాను. అక్కడ జనం బాగా రష్‌గా వున్న సమయంలో సీతకు సయనైడ్ సూది గుచ్చాలి. క్షణాల్లో పోతుంది సీత ప్రాణం. నేను గుండెలు బాదుకుని అరుస్తాను.

తర్వాత పోలీసులు రంగంలోకి ప్రవేశిస్తారు. ఉత్తరాలు చూపిస్తాను.

ఆ విధంగా సీత శీలం కూడా అపవిత్రమైనదని అంద

రికీ తెలుస్తుంది. అప్పుడు పార్వతీశం ముందుకు రావ డానికి భయపడతాడు. తను సీతకు మాజీ ప్రియుడన్న విషయం బయటపడే అవకాశం ఇవ్వకుండా ఉండటం కోసం—అతను పూర్తిగా మౌనంవహిస్తాడు.

అద్భుతమైన పథకమిది. దీనికి తిరుగులేదు.

# 10

ఆ రోజు సాయంత్రం నేను ఉత్సాహంగా ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లాను. నేను వెళ్లేసరికి అది అప్సరసలా తయారై ఉంది. చూడగానే కళ్ళు మరల్చుకోలేక పోయాను.

నానాటికీ దీని అందం ఇంతలా పెరిగిపోతోంది! నేనేమో దాన్ని చంపేయాలనుకుంటున్నాను!

"బీచికి వెడదామండీ!" అంది సీత.

"తప్పకుండా!" అన్నాను.

ఎంతో జాప్యం చేయకుండా ఇద్దరం బీచికి బయ ల్దేరాం. దారిలో హోటల్లో టిఫిను కూడా తిన్నాం.

ఆ రోజు బీచిదగ్గర చాలా హడావుడిగా వుంది. జనం బాగా ఎక్కువగా వచ్చారు. సీత అయిస్‌క్రీం తిందామని అడిగింది. అయిస్ పార్లర్ వద్ద చాలా రష్‌గా వుంది. ఇద్దరం వెళ్ళాం.

అక్కడ చాలామంది ఆడవాళ్ళున్నారు. వాళ్ళను చూడ్డానికొచ్చిన మగవాళ్ళు వున్నారు.

నేను దృష్టిని అయిస్‌క్రీంపైనే కేంద్రీకరించాను.

ఉన్నట్టుండి నా చెంప ఛెళ్ళుమంది—"యూ బ్రూట్ ఇడియట్—రాస్కెల్—స్కౌండ్రల్—నేనెవర్ననుకున్నావురా?" అంటోంది ఓ యువతి. నా కళ్ళు బైర్లు కమ్మాయి. ఆమె ముఖం కూడా సరిగా చూడలేదు.

చెంప తడుముకుని కళ్ళు నులుముకుని చూసేసరికి నా చుట్టూ చాలామంది వున్నారు. వాళ్ళలో ఆడ, మగా— ముసలీ, ముతకా—పెద్దా, చిన్నా ఉన్నారు. అందరు నన్నొక దోషిని చూసినట్లు చూస్తున్నారు. వాళ్ళ చూపులు చూడగానే నాకు భయం కూడా వేసింది.

“ఏమయింది?” అన్నాను.

“వేషం బాగానే వుంది. ఏమీ ఎరుగనట్లు ఎలా అడుగుతున్నాడో చూడండి. నలుగురూ నాలుగు తగిలించండ్రా” అన్నాడొకడుత్సాహంగా.

జనం మీదకు కదలబోతున్నారు. ఉన్నట్లుండి— “ఆగండి” అన్న కేక వినిపించింది. ఆ గొంతు గుర్తుపట్టాను. సీతది!

జనం మంత్రముగ్ధుల్లా ఆగిపోయారు. సీత కదలికలో, గొంతులో—ఏదో ఆకర్షణ, మంత్రం వుంది.

జనం మధ్యనుంచి సీత నన్ను సమీపించింది. దాని కళ్ళలో నీళ్ళున్నాయి. అది రుమాలుతో సుతారంగా కళ్ళు తుడుచుకొని—“ఈయన నా భర్త! పక్కన పెళ్ళాం ఉందన్న బుద్ధి కూడా లేదీయనకు. నన్ను బాధపెట్టటం కోసం ఇంటికి పరాయి ఆడవాళ్ళను కూడా తీసుకొచ్చి నా కళ్ళముందే అసహ్యంగా ప్రవర్తిస్తాడు. ఆ అలవాటులో పొరపాటిది. దయుంచి ఈయన్ను మీరేమీ చేయకండి. నామీద కోపంతో నన్ను చంపాలని కూడా చూస్తున్నారీయన. అయినా సరే—మీరంతా నన్ను మీ తోబుట్టువుగా భావించి—ఈయన్ను వదిలిపెట్టండి” అంటూ అందరికీ చేతులు జోడించింది.

అక్కడున్న అంతా నన్ను తలో మాటా అన్నారు.

నాకు మాట్లాడే అవకాశమివ్వలేదు. ప్రతి ఒక్కరూ సీతను పొగిడి—దాని అవస్థకు జాలిపడి—నన్ను బాగా తిట్టి వెళ్ళిపోయారు.

నేను వంచిన తల ఎత్తకుండా అన్నీ భరించి—అక్కణ్ణించి బయల్దేరాక—"అసలేం జరిగింది సీతా!" అనడిగాను.

"బయట ఓ ఆడపిల్లతో అసభ్యంగా ప్రవర్తిస్తే—ఆ పిల్ల మిమ్మల్ని కొట్టింది—"

"కానీ నేను అలా ప్రవర్తించలేదు—" అన్నాను.

"కొన్ని నేరాలకు శిక్ష ఆలశ్యంగా పడుతుంది—" అంది సీత.

"కానీ....ఇలా....ఇలా....ఇది చాలా అన్యాయం! అసలా పిల్లెవరో కూడా నేను చూడలేదు—"

"పెళ్ళి చేసుకోకుండా ఓ ఆడపిల్లననుభవిస్తే అది అన్యాయమేగా?"

"ఊఁ" అన్నాను నీరసంగా.

"అయితే వినండి. మిమ్మల్ని కొట్టిన పిల్ల పేరు రాధ!" అంది సీత.

మెదడు మొద్దుబారిపోయింది. సీత ఎంత తెలివిమీరి పోయింది. రాధ చేత నన్ను కొట్టించింది. రాధ అన్న మాటలు నా మెదడులో తిరుగుతున్నాయి—"ఆమె ఆడది, నేనూ ఆడదాన్ని, మా యిద్దరికీ అన్యాయం జరిగిందని నాకు అనిపిస్తోంది. ఒకవేళ నేనుకూడా నీకు ఎదురుతిరిగినా ఆశ్చర్యంలేదు—"

రాధ గూడా ఎదురుతిరిగి — నామీద చావుదెబ్బ తీసింది.

సీతను చంపాలని నేను వేసుకున్న పథకం దారు

ణంగా ఫెయిలై పోయింది. ఇప్పుడు సీతను నేనేం చేసినా మొత్తం ప్రపంచమంతా నన్నే అనుమానిస్తుంది.

"సీతా—నువ్వు బీచిలో నలుగురి ఎదుటా నా పరువు తీశావు—" అన్నాను. నా మాటల్లో కోపం లేదు. అసహాయత ఉంది. సీత నా గురించి రాధ దగ్గర అన్న మాటలు నిజమవుతున్నాయి. నేను ఏమీ చేయలేని, ఏమీ చేతకాని ఉత్త చవటమనిషిని!

"నేను మీ పరువు తీయలేదు. మీ గురించిన నిజం చెప్పాను. అదే మీ పరువుతీయడం అనిపించుకుంటే— మీ చుట్టూ అటువంటి నిజాలు సృష్టించుకోవడం మీరే మానేయాలి!" అది సీత.

ఇంటికి వెళ్ళేక సీత కాళ్ళు పట్టుకున్నంత పని చేసి— "సీతా! ఈ హింస భరించలేను. నువ్వెలా చెబితే అలా నడుచుకుంటాను—" అన్నాను. మానసికంగా నేనెంత దిగజారిపోయానంటే నేనప్పుడు యేడ్వడానికి సిద్ధంగా ఉన్నాను. సీత తెలివితేటల ముందు నా తెలివితేటలు చాలడంలేదు.

"దీన్నే—అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు అంటారు—" అంది సీత కఠినంగా.

సీత అలా ఎందుకందో నాకు కొద్దిక్షణాల తర్వాత అర్థమయింది.

దాని చేతిలో మొత్తం మూడు ఉత్తరాలున్నాయి.

"పనుండి పోస్టాఫీసుకి వెళ్ళాను. మీ ఆఫీస్‌లోని కొలీగ్ భాస్కరరావు అక్కడికి వచ్చాడు. ఎలాగూ వచ్చాను కదా అతను పోస్టు చేస్తున్నాట్ట. అందులో నా పేరున మీ ఆఫీసు అడ్రస్‌కి ఉత్తరం ఉందిట. అతను అది తీసుకుని నాకిచ్చాడు. ఉత్తరం చదివాను. నాకున్న

ప్రియులు నాకు తెలుసు. వాళ్ళను నేను నిర్లక్ష్యం చేయడంలేదు. వాళ్ళింకా "మాజీ" కాలేదు. కానివ్వను కూడా. ఉత్తరాన్నిబట్టి అది మూడోది.

నా ప్రాణాంతకమైన మొదటి రెండు ఉత్తరాలూ నాకెందుకు రాలేదు? ఇంట్లో వెతికాను. మీ పుస్తకాల్లో దొరికాయి ఆ రెండు త్తరాలూ! వాటిగురించి మీరు నాకు చెప్పలేదు. ఆ ఉత్తరాలు మిమ్మల్నేవిధంగానూ బాధించినట్లులేదు. నాగురించి మీరేమాత్రమూ ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోలేదు. అంటే ఆ మాజీప్రియుడు నన్ను చంపడం మీకు ఇష్టం. లేదా వాడి పేరుతో మీరే ఉత్తరాలు రాసి నన్ను చంపడానికి పథకం వేస్తున్నారు. నా అనుమానం రెండోదే నిజమని! అందుకే నా జాగ్రత్త నేను తీసుకున్నాను. పాపం—రాధ కోరిన వెంటనే సహకరించింది. ఆమెకు నా ధన్యవాదాలు చెప్పుకోవాలి!" అంది సీత.

మాట్లాడకుండా ఈ అభియోగం విన్నాను.

భాస్కరరావుగాడెంతపని చేశాడు? ఆ విషయం కూడా నాకు చెప్పలేదు వాడు. ఎందుకు చెబుతాడు?

ఈ మధ్య సీత కాస్త తెలుసున్న మగాడెదురైతే చాలు—గోముగా చూస్తోంది. గత రెండు మాసాలుగా భాస్కరరావు మా ఇద్దరికీ చాలాసార్లు తటస్థపడ్డాడు. వాడు దీనికేసి ఆకలిచూపులు చూడ్డం నేను గమనించక పోలేదు. ఈరోజు పోస్టాఫీసులో ఒంటరిగా ఒక్కర్తి కనబడేసరికి ఏదో వంకపెట్టుకుని దాన్ని పలకరించడం కోసం—పెస్ట్ చూసి....

నా అనుమానాలు మరికాస్త దూరం వెళ్ళాయి.

అంతేనా? లేక వాడు త్తరం చూసి—తీసుకుని ఇంటికి

కూడా వెళ్ళేడా? వెధవ....ఎంతకైనా తగును!

ఎక్కువదూరం ఆలోచించలేను. మన బంగారం మంచిది కానపుడు ఎవర్నను కుని ఏం లాభం?

## 11

వారంరోజులు ప్రశాంతంగా గడిచాయి. ఈ వారం రోజులూ నేను కర్తవ్యం ఆలోచిస్తూనే ఉన్నాను. సీత సృష్టించిన సమస్యలన్నింటికీ పరిష్కారమార్గం ఏవిటా అన్నది ఎంత ఆలోచించినా నాకు స్ఫురించడంలేదు.

ఇంటివద్ద మాత్రం నేను పూర్తిగా సీతకు దాసుడ నయ్యాను.

"సీతా! నేను పాపిని, దుర్మార్గుణ్ని. ఇంతకాలం నిన్ను హింసించాను. అందుకు నువ్వు ప్రతీకారం తీర్చుకున్నావు. ఇంకమీదట జరిగింది మర్చిపోదాం. ప్రతినెలా జీతంతెచ్చి నీ చేతుల్లో పోస్తాను. నువ్వెలా ఆజ్ఞాపిస్తే అలా నడుచుకుంటాను. ఇంకమీదట ఒక్క తప్పుచేసినా నన్ను నువ్వు క్షమించవద్దు. ప్రస్తుతానికి నీ నడవడిక మార్చుకో సీతా!" అంటూ దానికాళ్ళమీద పడ్డాను. నా చేతులు, తల—దాని పాదాల్ని స్పృశిస్తున్నాయి.

అందరు ఆడవాళ్ళలా అది పాదాలు వెనక్కు తీసుకో లేదు. "తప్పతాగి కారు నడిపితే—ఒక మనిషి ప్రాణాలు పోయాయి. ఆ తర్వాత తప్పుచేసినవాడు వాడికాళ్ళమీద పడితేమాత్రం పోయిన ప్రాణాలు తిరిగొస్తాయా? మంచులా చల్లబడిన ఆ కాళ్ళలోని రక్తం వెచ్చబడి తిరిగి ప్రవహిస్తుందా?" అనడిగిందామె.

నేను లేచి కూర్చుని—"అయితే ఏమంటావ్?" అన్నాను.

"మీరు నాలో మనిషిని చంపేశారు" అంది సీత.

"నన్నేం చేయమంటావో చెప్పు—" అన్నాను దీనంగా.

"మెడికల్ కాలేజీకి వెళ్ళి—ఏ ప్రొఫెసర్నయినా కలిసి—చచ్చినవాళ్ళను బ్రతికించే మందు కనిపెట్టి ఇమ్మని అడగండి. అలాంటి మందు కనిపెట్టాక అది తెచ్చి నాకివ్వండి—"

ఇంక సీతతో మాట్లాడి ప్రయోజనంలేదని గ్రహించాను. ఆమె నాకు లొంగదు. కొంతకాలంపాటు ఆమెతో సహజీవనంచేస్తాను. ఆమె భర్తకులా, నేను భార్యకులా ఉంటాం. అప్పటికీ ఆమెలో మార్పురాక పోతే అది నా దురదృష్టం.

"ఈరోజునుంచీ నువ్వు నాకు భర్తవు. నాలోని పాత మనిషి కూడా చచ్చిపోయాడు—" అన్నాను సీతతో.

సీత యేమనుకుందో చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు నాకు సంతోషాన్ని కలిగించేలా లేదు. చచ్చిన పాముపైకి కర్ర ఎత్తినవాడు నవ్వితే—ఆ నవ్వు బహుశా అలాగే ఉండి ఉంటుంది....

మర్నాడు సాయంత్రం నేను ఆఫీసునుంచి తిరిగి వచ్చే సరికి సీత చక్కగా అలంకరించుకుని ఉండటమే కాక నావంక మనోహరంగా చూసి నవ్వింది. చాలారోజుల తర్వాత సీత నాకు అటువంటి నవ్వును ప్రసాదించింది. ఆ నవ్వు నాకు సంతోషాన్ని కలిగించింది. సీతలో మార్పు వచ్చినట్లు అది సూచిస్తూందా?

ఇద్దరం డ్రాయింగు రూమ్‌లోకి వెళ్ళాం.

ఆ గది అలంకరణలో మార్పు ఉంది. మామూలుగా ఉండే బొమ్మలూ అవీ అక్కడ లేవు. సోఫాలున్నాయి. షోకేసుస్థానంలో ఓ బల్ల ఉంది. ఈ బల్ల షోకేసుకంటె

కాస్త ఎత్తుగా—దానికంటె కాస్త సన్నగా ఉంది. ఆ టేబులుమీద ఒక తాడు వుంది.

"యేమిటిదంతా?" అనడిగాను.

"నాకీరోజు మీతో సరదాగా ఉండాలని వుందండీ—" అంటూ సీత నా దగ్గరగా వచ్చి నా నడుం చుట్టూ చేయివేసింది. ఆమె అలా చేయగానే నాకు చాలా ఉత్సాహం కలిగింది.

సీత నాకు దూరంగా వెళ్ళిపోతున్నప్పట్నించీ, ఆమె అందడం అరుదైన క్షణంనుంచీ, ఆమె నన్ను నిర్లక్ష్యం చేయడం అరంభించినప్పట్నించీ, పరాయిపురుషులామె ఒంటిపై చేయివేయాలనుకుని ప్రయత్నిస్తున్నప్పట్నించీ—ఆమెపై నాకు అకర్షణ పెరగడం మొదలుపెట్టింది. ఆలోచనల్లోకూడా సీతను—"అది" అనుకోలేకపోతున్నాను.

అప్రయత్నంగా నేనూ ఆమెను దగ్గరగా తీసుకున్నాను.

ఉన్నట్లుండి సీత చటుక్కున నా పెదాలను బలంగా స్పృశించింది. నాకు కలిగిన థ్రిల్ ఇంతా అంతా కాదు.

"సీతా! థాంక్యూ సీతా!" అన్నాను. ఆమెపట్ల నాకు ఆ క్షణంలో కృతజ్ఞతాభావం కలిగింది.

సరిగ్గా అప్పుడే ఎవరో కాలింగ్ బెల్లు మ్రోగించారు. తలుపుతట్టిన వాడిపై నాకు కలిగిన చిరాకు ఇంతా అంతా కాదు.

"ఉండండి—నేను వెళ్ళి వస్తాను—" అంటూ సీత నన్ను విడిపించుకుంది.

నేను ఉన్నపళంగా, నీరసంగా సోఫాలో కూలబడి—"వచ్చినవాళ్ళను అలాగే పంపించేసిరా!" అన్నాను.

సీత అడుగులచప్పుడు దూరమయింది. నేను అసహ

నంగా ఎదురు మాన్తూండంగా మళ్ళీ అడుగుల చప్పుడు విన బడింది. తలెత్తి చూశాను. ఎదురుగా.... వాడు.... దొంగ వెధవ....

# 12

ఆ దొంగ వెధవ సీత నడుం చుట్టూ చేయి వేసి నడిపించు కుని తీసుకువస్తున్నాడు. సీత వాడికి దగ్గరగా అంటుకుని పోయి నడుస్తోంది. ఆమె కన్నుల్లో తన్మయత్వం గోచ రిస్తోంది.

"వాటీజ్ దిస్!" అంటూ అరిచాను.

"అరవకండి—" ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది సీత— "ఇప్పుడు మీరు నాకు భర్తకాదు, నేను మీ భర్తను. మీరు నా భార్య. నేను అన్యాయాలు చేయను. ఇతను నేనంటే మోజుపడి వచ్చాడు. మీ దరిద్రపు ముఖాన్ని చూసి యే మగాడైనా మోజుపడితే మీరూ వాణ్ని తెచ్చుకోండి, నేను పడకగదికి వెళ్ళిపోతున్నాను—"

ప్రాన్పడిపోయాను.

సీత శాపాలనే నన్ను రెచ్చగొట్టి—అప్పుడు తన ప్రియుణ్ని రప్పించుకుంది.

నే నేదో మాట్లాడేలోగా ఇద్దరూ పడకగదికి వెళ్ళి తలుపులు వేసుకున్నారు. నేను వినాలనో ఏమో, తలుపులు చాలా గట్టిగా చప్పుడుచేస్తూ వేశారు.

ఇప్పుడు నే నేం చేయాలి?

నా రక్తం మరిగిపోవడంలేదు కానీ అవమానంతో ముఖం కమిలిపోతోంది, మనసు కుమిలిపోతోంది.

నాపై ఎన్ని దెబ్బలు తీయాలో—అన్ని దెబ్బలూ తీసింది సీత! ఇప్పుడు.... ఆమె బ్రతుకు బైటపడితే.... పది మందినీ పిలిచి అల్లరిచేస్తే....

చేసే ముందు సీతను హెచ్చరించాలనుకున్నాను. ఆ విధంగా వాడు బైటకుపోయినా నాకు కాస్త తృప్తి కలుగుతుంది. అందుకే మా పడకగదికి పరుగెత్తి తలుపులు తట్టి—“సీతా! పదిమందినీ పిలిచి నీ బ్రతుకు బైటపెడతాను, మర్యాదగా బైటకురా—” అన్నాను.

లోపల ఎవరో కదిలిన చప్పుడయింది. అడుగుల చప్పుడు తలుపులవతలివైపుదాకా వచ్చి ఆగాయి.

“ఏమండీ—మీకింకా బుద్ధిరాలేదా? నాకంత తెలీదనుకున్నారా? పదిమందినీ పిలిచి చూడండి. డబ్బుకోసం నా భర్తే నన్ను నలుగురికీ తారుస్తున్నాడంటాను. జనం మీమాట నమ్ముతారో, నామాట నమ్ముతారో చూద్దురుగాని....”

సీత మాటలు ఆగిపోయాయి. ఆమె వెనక్కు వెళ్ళిపోతున్న అడుగుల చప్పుడయింది. ఆ తర్వాత ఊహించుకోవడానికి అసహ్యం వేసింది.

జుట్టు పీక్కున్నాను, తల బాదుకున్నాను.

సరిగ్గా అప్పుడే నాకు గుర్తుకొచ్చింది, డ్రాయింగు రూంలో బల్ల! బల్లమీద తాడు.

సీత అవక్కడ నాకోసమే ఉంచింది.

ఈరోజు తన ప్రవర్తన కారణంగా నేనేం చేస్తానో ఆమె ఊహించింది. అందుకే అన్నీ సిద్ధం చేసి తన పథకం అమలుజరిపింది. సీత చాలా తెలివైనది! ఆమె తెలివితేటల ముందు నేను చాలా అల్పుణ్ని! ఈ జీవితం నేనింక భరించలేను. నన్నంతం చేసుకోవడం ఒక్కటే మార్గం! సీత చూపిన పరిష్కారాన్ని నే నమలుజరుపుతాను.

డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాను. అక్కడున్న బల్లను గది మధ్యకు లాగాను. టేబిలుమీద తాడును జాగ్రత్తగా

ఫాన్‌కు కట్టాను. తాడు కొసను నా మెడకు కట్టుకుని జారుముడివేశాను.

ఆత్మహత్యకు సిద్ధంగా వున్నాను నేను.

మనసు హెచ్చరిస్తోంది—మరి కాసేపు ఆలోచించమని! వివేకం హెచ్చరిస్తోంది—చచ్చి ఎవర్ని సాధిస్తావని!

నాలోని పిరికివాడు మాత్రం ఈ జీవితంనుంచి పారిపోవడానికిదొక్కటే మార్గమని పదేపదే చెబుతున్నాడు.

నేను చస్తే ఏమవుతుంది? సీత ... వాడు సుఖంగా వుంటారు.... ఊహుఁ.... ఉండరు. సీత విచ్చలవిడితనాన్ని వాడూ భరించలేడు. సీత ఒకరోజున వాడికోసం కూడా డ్రాయింగ్ రూంలో బల్ల వేసి—తాడు పెడుతుంది.

బల్ల కాలితో ఒక్క తాపు తన్నానంటే చాలు.... నా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

కాలెత్తి....బల్లను తన్నబోయాను. అప్పుడు గుర్తొచ్చింది....చచ్చేముందు దైవప్రార్థన చేసుకుంటే వచ్చే జన్మలోనైనా తీరని కోరికలు తీరతాయని.

అయినా నా తీరని కోరికలు ఏమిటి?... ఎక్కువ ఆలోచించలేదు. ఇలా అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకునే అగత్యం కలక్కుంటే చాలు వచ్చే జన్మలో!

నేను గుండె రాయి చేసుకున్నాను. కాలు పైకెత్తి బల్లను తన్నేశాను.

బల్ల పడిపోయింది. నేను గాలిలో వ్రేలాడుతున్నాను. తాడు మెడకు బాగా బిగుసుకుంది. ఇంతలో ఉన్నట్టుండి దబ్బున క్రిందపడిపోయాను. ఏమైందో తెలియదుకానీ కళ్లు బైర్లు కమ్మాయి.

తాడు తెగిందని తెలుస్తూనే వుంది.

నేను క్రిందపడి వెంటనే లేవలేకపోయాను, లేచేలోగా

సీత, దొంగ వెధవ—చెట్టాపట్టాలు వేసుకుని అక్కడకు వచ్చారు.

నన్ను చూసి సీత హేళనగా నవ్వింది—"ఆఖరికి ఆత్మ హత్య చేసుకోవడం కూడా చేతకాదు మీకు" అంది.

"నువ్వక్కడ.... అలాంటి తాడు వుంచావు ...." అన్నాను.

"పటిష్టమైన తాడక్కడ వుంచితే అది హత్య అవుతుంది—" అంటూ మళ్ళీ నవ్వింది సీత.

"వాడితో మనకేమిటి డియర్—పద పోదాం—" అన్నాడా దొంగ వెధవ.

"ఎవడ్రా నువ్వు?"

"నేను సీతను ప్రేమించాను. కులం కుదరలేదని పెద్ద లొప్పుకోలేదు. సీత వాళ్ళు గీచిన గీటు దాటలేదు. నిన్ను పెళ్ళిచేసుకుంది. నువ్వు సీతను భార్యలాకాక ఆట బొమ్మలా చూశావు. శారీరకంగా, మానసికంగా హింసించావు. కాని సీత అన్నీ సహించింది. గీతదాటని మహా పతివ్రతగా ఉండాలని నిర్ణయించుకుంది. అనుకోకుండా నే నీ ఊరు వచ్చాను. సీత జీవితం చూశాను. తనకు ఈ జీవితంనుంచి విముక్తి కలిగించాలనుకున్నాను. నాతో వచ్చేయమని అడిగాను.

సీత రానంది. ముందు నన్ను వంచకుడని దుర్భాష లాడింది. పెళ్ళయిన స్త్రీపై ఆశపెట్టుకోవడం దుర్మార్గ మంది! నేను వెళ్ళిపోయాను—తాత్కాలికంగా మాత్రం. నీలాంటివాడు ఆడదాని సహనానికి పరీక్షపెట్టి నెగ్గ గలడని నాకు తెలుసు. నీ కారణంగా సీత నా దారికి వచ్చింది. ఈ సమాజం గీచిన గీటుదాటింది. దాటితే యేమైంది?" అని నవ్వాడు దొంగ వెధవ.

"ఆడది ఎదురు తిరగనంత సేపే ఈ సమాజం అంక్షులు విధిస్తుంది. నీలాంటి వెధవలు ఎదురైతే ఏ ఆడదైనా ఎదురుతిరుగుతుంది! అలాంటప్పుడు మీరేమీ చెయ్య లేరనేదానికి నీ కథే సాక్ష్యం! ఇప్పుడు నేను నా సీతను తీసుకుని వెళ్ళిపోతున్నాను. మళ్ళీ మేము నీకు కనిపించం. నువ్వు మాత్రం మళ్ళీ పెళ్ళిచేసుకుంటే—మరో సీతను గీత దాటించకు—"

సీత నామీదకు చిన్న కాగితం ఉండ విసిరి, ఆ దొంగ వెధవను వాటేసుకునే అక్రాణ్ణించి కదిలింది.

నాకు లేచే ఓపికలేదు. వళ్ళంతా నొప్పులుగా ఉంది. దగ్గరో నేపడ్డ ఆ కాగితం ఉండ అందుకుని విప్పి చదివాను.

"మాజీ ప్రియుడుగారికి—

ప్రియుల ఆదరణకారంగా భర్తవైనా నిన్ను నేను నిర్లక్ష్యన చేశాను. నీకళ్ళముందే కొత్తభర్తను ఎన్నుకుని వెళ్ళిపోతున్నాను. బాగుంది కదూ!—అయామ్‌సారీ టు బిడ్ యూ గుడ్ బై—

నీ మాజీ భార్య!"

ఒకప్పుడు నేను రాసిన ఉత్తరానికి జవాబు అది. సీతా అని అరవాలనుకుని ఆగిపోయాను.

అప్పటికి సీత—ఆ దొంగవెధవతో కలిసి—గడప దాటింది.

—: ఐ పో యిం ది :—